దారి సమస్య పరిష్కరించాలి

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, మార్చి 10: హుస్నాబాద్ పట్టణంలోని యేనె పక్కన నిర్మించిన రైతు వేదికకు వెళ్లే దారి ఇరుకుగా మారుతుందని, దీనిని 30అడుగుల వెడల్పుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ఎల్లమ్మ దేవాలయ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తూ కేవలం 24 అడుగుల దారిని మాత్రమే వదిలిపెడుతున్నారని, దీని వల్ల రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రైతులు నిత్యం రైతు వేదికకు వచ్చివెళ్తుంటారని, వారి వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. అధికారులు వెంటనే 30 ఫీట్ల రహదారి ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిట్యాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 10: మండలంలోని చిట్యాల గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ. 5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి సులోచనాశ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బొడిగం జ్యోతి, నాయకులు బొడిగం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

మిరుదొడ్డి: అక్బర్‌పేటలో డప్పుల ర్యాలీ నిర్వహిస్తున్న దండోరా నాయకులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 10: ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాంగ్రెస్, బీజేపీలు మాదిగలను మోసం చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు కాకి కొండల్ ఆరోపించారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మాదిగ దండోరా ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా డప్పుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృపావరం, రాజశేఖర్, యాదగిరి, ప్రవీణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయాలి

పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

సిద్దిపేట, మార్చి 10: మార్కెట్‌కు పొద్దు తిరుగుడు పంటతీసుకొస్తే పట్టించుకునేనాథుడే లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. సోమవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రైతు సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట చేతికి వచ్చి అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే ప్రభుత్వం ఇంకా కొనుగోళ్లు చేపట్టడం లేదన్నారు. దీంతో వ్యాపారస్తులు రూ.4800 నుంచి రూ. 5,200 చొప్పున కొనుగోలు చేస్తున్నారన్నారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.7,280 ఉంటే రైతులు సుమారు రూ.2 వేల వరకు నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. 20 వేల వరకు గన్నీబ్యాగులు అవసరం ఉంటే ఒక్క గన్నీ బ్యాగు రాకపోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదు

కొండాపూర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

మిరుదొడ్డి, మార్చి 10: వరి పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు వజ్జపల్లి రాజేశ్వర్‌రావు ఆరోపించారు. సోమవారం మండలంలోని కొండాపూర్‌లో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలాపున మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ ప్రభుత్వం కాల్వలు పూర్తిచేయక పంటలకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ కాల్వలను త్వరగా నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంటేరు నరేందర్‌రెడ్డి

జగదేవపూర్. మార్చి 10: శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 235 ఎకరాల్లో శనగ పంట సాగైందని, రైతులు పండించిన శనగలను దళారులకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎక్బాల్, వ్యవసాయ అధికారి వసంతరావు, కనకయ్య పీఏసీఎస్ సీఈవో రాములు, సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ మనుచౌదరి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, మార్చి 10: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 54 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట మున్సిపాలిటీ ఆదర్శంగా ఉండాలి

సిద్దిపేట, మార్చి 10: సిద్దిపేట మున్సిపాలిటీ అన్నింటా ఆదర్శంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు ఆధ్వర్యంలో జరిగిన మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రు.75.19 కోట్ల బడ్జెట్‌ను జూనియర్ అకౌంటెంట్ వెంకటరావు ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో ప్రారంభమైన అనేక కార్యక్రమాలు దేశ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం పన్నులు వసూలు చేయడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హరిత బడ్జెట్‌లో భాగంగా సిద్దిపేటలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక రూపకల్పన సిద్ధం చేయాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని దీనిపై చర్యలు తీసుకోవాలని పట్టణ కౌన్సిలర్లు కోరగా యానిమల్ బర్త్ కంట్రోల్ నిర్వహణ సెంటర్, కుక్కలు పట్టుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. ఎల్ఆర్ఎస్‌పై కౌన్సిలర్లు లేవనెత్తిన సందేహాలను క్లుప్తంగా వివరించారు. పట్టణంలో ఎస్సీ, ఎస్టీ వార్డుల్లో అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు కోరగా వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సహాయ సహకారాలతో సిద్దిపేటను రాష్ట్రంలోనే అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

'తపాస్‌పల్లి' నుంచి సాగునీరు అందించాలి

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు

కొమురవెల్లి, మార్చి 10: తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి దాని ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణగౌడ్, రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను రైతులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష కట్టిందన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో లేని కరువు కాంగ్రెస్ వచ్చినంకనే వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సాగునీరు లేక రైతులకు కన్నీళ్లు మిగిలాయన్నారు. ఇప్పటికే చాలామంది రైతులు తమ పంటను సగమైన కాపాడుకునేందకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వం స్పం దించి వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపితే ఈ ప్రాంతంలో సగం పంటలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ వూడెం గోపాల్‌రెడ్డి, రైతులు దుర్గారెడ్డి, ప్రభాకర్, నరేశ్, కాజాపాషా, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

హుస్నాబాద్, మార్చి 10: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం ఆవరణలో కొత్తగా నిర్మించనున్న పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్‌రావు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన పోచమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ తన సొంతడబ్బులు వెచ్చిస్తున్నారని, ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ కౌన్సిలర్లు పున్న లావణ్య సది, వల్లపు రాజు, చిత్తారి పద్మ, నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జాజిరి..జాజిరి..జాజిరి

హుస్నాబాద్‌లో జాజిరి...జాజిరి ఆడుతున్న చిన్నారులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 10: కాముని పున్నం మరోమూడురోజులు మాత్రమే ఉండగా హోలీఆటలు, పాటలతో వాడలు హోరెత్తుతున్నాయి. కాముని పున్నానికి తొమ్మిదిరోజుల ముందునుంచే పిల్లాపెద్దలు హోలీ ఆటలు, పాటలు ప్రారంభిస్తారు. సిర్ర లతో జాజిరి... జాజిరి... రింగురింగు బిల్ల.. రూపాయి బిల్ల.. అంటూ ఇండ్లలోకి వెళ్లిపిల్లలు... హోలీ... హోలీల రంగవోళి అంటూ మహిళలు పాటలు పాడుతూ హోలీ వేడుకలు జరుపుకొంటున్నారు.

పారదర్శకంగా రవాణా సేవలు

జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు

అధికారులు ఏర్పాటు చేసిన ప్లెక్సీ

సిద్దిపేట టౌన్, మార్చి 10: పారదర్శకంగా రవాణా శాఖ సేవలు అందిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొండల్‌రావు తెలిపారు. వివిధ రకాల సేవల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వాహనదారులకు ప్రత్యేకంగా ప్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణా శాఖ సుమారు 70 రకాల సేవలు అందిస్తున్నదన్నారు. దరఖాస్తు దారులు సేవలు పొందుటకు నేరుగా మీసేవ కేంద్రంలో ప్రభుత్వ నిర్ణీత రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకొని సరైన పత్రాలను రవాణా కార్యాలయంలో అందించాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సేవలు పొందాలన్నారు.

సావిత్రిబాయిపూలే జీవితం స్ఫూర్తిదాయకం

జగదేవపూర్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జైభీం కమిటీ నాయకులు

సిద్దిపేట, మార్చి 10: సావిత్రిబాయిపూలే జీవితం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా సామాజిక, సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అభిషేక్ భాను, ఆముదాల రంజిత్‌రెడ్డి, నాయకులు భరత్ కుమార్, అఖిల్, విష్ణు,తేజ, చక్రి పాల్గొన్నారు.

కోహెడలో...

కోహెడ, మార్చి 10: భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి హాజరై సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవింద రావు, వలస సుభాష్, గవ్వ వంశీధర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్, బందెల బాలకిషన్, కాయిత రాందాస్, పిడిశెట్టి రాజు, వేల్పుల శంకర్, మహ్మద్ ఆవేజ్, తలారి నర్సయ్య, రామారి మల్లేశ్ పాల్గొన్నారు.

జగదేవపూర్‌లో..

జగదేవపూర్, మార్చి 10: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతిని జైభీం యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జై భీం కమిటీ అధ్యక్షుడు మచ్చ హరీశ్, నాయకులు మచ్చ చంద్రయ్య, యాదయ్య, గడ్డం కల్యాణ్, అరుణ్, దినేశ్, సాయి, శేఖర్, అరవింద్, గడ్డం భాను, పర మేశ్, ప్రణయ్ పాల్గొన్నారు.

రైతుల పంటలు కాపాడాలి

- ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి
- తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, మార్చి 10: గోదావరి జలాలతో చేర్యాల ప్రాంతంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి దేవాదుల కాల్వల ద్వారా నీటిని పంపింగ్ చేసి రైతుల పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ చేర్యాల తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు ఆర్ఐ రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ ఎండిన పంట పొలాలను సర్వే చేయించి ఎకరాకు రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు ఆగమవుతుంటే రైతులకు అన్ని సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ పబ్బం గడుపుతుందని ఆరోపించారు. రైతాంగాన్ని ఆదుకోవాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని, చెరువులు, కుంటలు నింపితే రైతుల పంటలు నేడు ఎండిపోయేవి కావాన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 40 నుంచి 50శాతం పంటలు ఎండిపోయాయని మార్చి చివరి నాటికి భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడం వల్లనే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ధర్నాలో మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, నాయకులు గొర్రె శ్రీనివాస్, నాగపురి కనకయ్య, దర్శనం రమేశ్, రేపాక కుమార్, మోకు ఇంద్రారెడ్డి, దొండకాయల సంపత్, ఎండీ కరీం, రాళ్లబండి భాస్కర్, ముస్త్యాల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై రియల్ వ్యాపారులకు అవగాహన

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, మార్చి 10: మున్సిపల్ కార్యాలయంలో ఆల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ విధి విధానాలపై కమిషనర్ గొల్కొండ నర్సయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్-2020 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీ సకాలంలో (ఈ నెల 31లోగా) చెల్లించి పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు విక్రయించిన వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి ఆలయంలో ప్రక్షాళన చేపట్టాలి

ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

చేర్యాల, మార్చి 10: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో జరుగుతున్న పలు అవినీతి, అక్రమాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించి ప్రక్షాళన చేయాలని కొమురవెల్లి గ్రామ యువకులు డిమాండ్ చేశారు. ఆలయంలో జరుగుతున్న అవినీతి, అరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఈవో రామాంజనేయులకు యువజన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం తాత్కాలిక సిబ్బంది భక్తుల నుంచి డబ్బులు ఫోన్‌పే చేయించుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వీవీఐపీ పాసుల జారీ ఇష్టారాజ్యంగా జరుగుతున్నదని, దీనివల్ల ఆలయ ఆదాయానికి గండిపడుతున్నట్లు తెలిపారు. డబ్బులు ఫోన్ పే చేయించుకున్న వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఆలయ వీధుల్లో మురుగు ప్రవహిస్తున్నందున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మురుగు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన యువజన సంఘం నాయకులతో పాటు మాజీ డైరెక్టర్ ముత్యం నర్సింహులు మురుగు నీరు ప్రవహించే పైపులైన్లు మరమ్మతు చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు ఏర్పుల మహేశ్, సనాది కరుణాకర్, ఉప్పల వంశీ, దొడ్ల ప్రవీణ్, గజ్జి వెంకటేశ్, మ్యాకల నిఖిల్, పాశం భరత్ తదితరులున్నారు.

మహిళ దారుణ హత్య

- గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో ఘటన
- పరారీలో హంతకుడు
- విచారణ చేపడుతున్న పోలీసులు

విచారణ చేపడుతున్న పోలీసులు

గజ్వేల్, మార్చి 10: మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో రాజీవ్ రహదారి పక్కన హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని చర్లపల్లికి చెందిన సాధక్ తన భార్య అస్రాతో కలిసి కొంత కాలంగా రిమ్మనగూడ హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద సెక్యూరిటీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. అస్రా (45)కు 30 ఏండ్ల క్రితం సాధక్‌తో వివాహం జరిగింది. ఆమె హైదరాబాద్‌లో ఓ న్యాయవాది వద్ద అటెండర్‌గా పనిచేస్తున్న క్రమంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన అస్లంతో నాలుగేండ్ల క్రితం పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల పాటు ఇండోర్‌లో అతడితో ఉన్న ఆమె ఆరు నెలల క్రితం మొదటి భర్త సాధక్ వద్దకు రాగా రిమ్మనగూడ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం అస్రా ఆమె కుమార్తెతో కలిసి ఇండోర్ వెళ్లి అక్కడ అస్లంపై పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆది వారం హైదరాబాద్ వెళ్లిన అస్రాకు అస్లం కలవడంతో ఇద్దరు కలిసి రాత్రి రిమ్మనగూడకు వచ్చారు. ఇండోర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన విషయంపై ఇద్దరి మధ్య సోమవారం తెల్లవారుజామున గొడవ జరగడంతో ఆమె ముఖంపై పారతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అక్కడే ఉన్న భర్త సాధక్ అడ్డుకునే ప్రయత్నం చేయ గా అతడిని కూడా గాయపర్చి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు భర్త సాధక్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అమెకు ముగ్గురు అమ్మాయిలు, ఒక కుమారుడు ఉన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గజ్వేల్, మార్చి 10: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న జాబ్ మేళా నిర్వంచనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ముత్తూట్ పైనాన్స్‌లో ఉద్యోగాల కోసం ఎంపిక జరుగుతుందని, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 35 ఏండ్లలోపు వయస్సు కలిగిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. గజ్వేల్, సిద్దిపేట, రామాయంపేటలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

దరఖాస్తు గడువు పెంపు

సిద్దిపేట అర్బన్, మార్చి 10: సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్‌లోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 20వ తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ ఎం.రవీందర్‌గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ. 200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, పీహెచ్‌సీ కేటగిరి విద్యార్థులు రూ.125 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, పూర్తి వివరాలకు www.telanganams.cgg.gov.in వైబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

17న హుస్నాబాద్ పశువుల అంగడి వేలం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 10: హుస్నాబాద్ అంగడి (పశువులు, గొర్రెలు, మేకలు) వేలం ఈనెల 17వతేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు ఈనెల 15వతేదీ సాయంత్రం ఐదుగంటల వరకు రూ.పది లక్షల రూపాయల డీడీ లేదా నగదును మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని అధికారులు సూచించారు. టెండర్‌లో పాల్గొనేవారు తప్పకుండా రూ. ఐదువేల ఫీజు చెల్లించి దరఖాస్తు సమర్పించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

బెజ్జంకి, మార్చి 10: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని విద